# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 29.05.2025 | 24 క్యారెట్లు 89,215.00 | కిలో వెండి 1,09,056.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:208

www.vishalabharati.com




# యుగ పురుషుడు ఎన్టీఆర్

- ఘనంగా ఎన్టీఆర్ 102వ జయంతి
- సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచారు
- నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్

**విశాల భారతి స్టేట్ బ్యూరో:**
టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు హైదరాబాదులోని ఎన్టీఆర్ ఘాట్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకున్న జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ లకు అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులర్పించి, పుష్పగుచ్చాలు పెట్టి వారి తాతను స్మరించుకున్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రముఖుల రాక సందర్భంగా ఘాట్ వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. నందమూరి కుటుంబ సభ్యులతో పాటు ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి, టీడీపీ నేతలు, అభిమానులు, రాజకీయ సినీ ప్రముఖులు, తదితరులు ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు.ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులర్పించి, యుగ

..మిగతా 2 లో

# కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది

**సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించేసుకోవాలి**

సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని జగ్జీవన్‌రాం భవన్‌లో గురుకుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్బంగా సీఎం మాట్లాడుతూ.. కోఠిలోని మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసుకుంటున్నట్లు తెలిపారు. పాలితులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు, చదువు మాత్రమేనని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువులతోనే సాధ్యమవుతుందని రేవంత్ రెడ్డి అన్నారు.



- జగ్జీవన్‌రాం భవన్‌లో గురుకుల అవార్డుల ప్రదానోత్సవం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం
- రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు
- 15 నెలల్లోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం
- కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం
- రూ. లక్ష ఇచ్చి ప్రోత్సహం
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు కూడా బాగుండాలని సీఎం వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువులు వద్దు.. కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు, బీసీలు.. గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్లుగా మాజీ సీఎం వ్యవహరించారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారని, మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట



ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు కూడా బాగుండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువులు వద్దు.. కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్లుగా మాజీ సీఎం

..మిగతా 2 లో

# రైతులకు గుడ్‌న్యూస్

- వరికి మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం
- క్వింటాల్‌కు రూ.69 పెంచింది
- కేంద్ర కేబినెట్ సమావేశంలో ఐదు కీలక నిర్ణయాలు
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు ప్రభుత్వం వరాలు ప్రకటించింది. ఎమ్మెస్పీ 50శాతం పెంచింది. కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గత పది పదకొండేళ్లలో ఖరీఫ్ పంటలకు ఎమ్మెస్పీ భారీగా పెరిగిందన్నారు. 202526 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ఎమ్మెస్పీ పెంపునకు ఆమోదం చెప్పింది. 202526 ఖరీఫ్ సీజన్‌కు వరికి క్వింటాల్‌కు రూ.69 మద్దతు పెంచింది. తాజాగా పెంపుతో రూ.2,369 పెరిగిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.



రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కేటాయించినట్లు పేర్కొన్నారు. జొన్నలు క్వింటాల్‌కు రూ.328, సజ్జలు క్వింటాల్‌కు రూ.150, రాగులు క్వింటాల్ రూ.596, మొక్కజొన్న

..మిగతా 2 లో



## తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా అపరేష్ కుమార్

- ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా అపరేష్ కుమార్
- హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ


**చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేపలు సిద్ధం**

- గత సంవత్సరం కంటే అదనంగా మరిన్ని ఏర్పాట్లు
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలి
- అగ్నిమాపక బృందాలు అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర డిపార్ట్మెంట్లు సమన్వయం
- హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

..మిగతా 2 లో

## పద్మశ్రీ బాధ్యతను మరింత పెంచింది

- ఉద్యమాలకు దక్కిన గుర్తింపు
- పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది
- జాతికి వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాం
- లక్ష్యం కోసం పనిచేస్తే గుర్తింపు, గౌరవం వస్తుంది
- దేశంలో పెండింగ్ సమస్యలపై పోరాడుతం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని.. ఈ అవార్డు ఉద్యమాలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు

..మిగతా 2 లో



## ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపు

- కేంద్ర కేబినెట్ ఐదుకీలక నిర్ణయాలు
- రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

..మిగతా 3 లో



## రాజ్యసభకు కమల్ హాసన్

- డీఎంకే అధికారిక ప్రకటన
- 8 రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు

..మిగతా 2 లో

## రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం పనిచేస్తోందా?

- 16 వేల అప్లికేషన్లు పెండింగ్
- ఆర్థిక వ్యవహారాల వివరాలపై శాఖ మౌనమెందుకు?
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ



..మిగతా 2 లో

# ఎన్డీఎస్‌ఏ నివేదిక తప్పుల తడక

- కనీస పరీక్షలు నిర్వహించకుండా తుదిరి పోర్టు ఎలా...
- మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్‌ఏ నివేదికపై ఎల్అండ్ టి సూటిగా ప్రశ్న
- కాంగ్రెస్ ,బీజేపీ ప్రభుత్వాలకు చెంపపెట్టు
- రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మానుకోవాలి
- కేసీఆర్ పేరొస్తుందనే కాళేశ్వరంను పక్కన పెట్టారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ

..మిగతా 3 లో



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
29.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**నారాయణపేట, విశాలభారతి:**

ఇటు రాజకీయరంగంలో అటు సినీ రంగంలో సాటిలేని మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని రెండు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హయాంలో బడుగు బలహీన వర్గాలకు చేయూతతో పాటు కూడు,గూడు,గుడ్డల నందించి తెలుగోడి ఘన కీర్తిని నలు దశల చాటిన మహానీయుడని ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకులు ఓం ప్రకాష్ ముదిరాజ్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలో ఓం ప్రకాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా శక్తి పీఠంలో పేదలకు మిఠాయిలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవ, మహేందర్, పెంటయ్య, భీమన్న,యాబన్న చౌదరి,వద్ది నారాయణ,కిష్టప్ప,రమేష్,భోప్ప తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది

**తరువాయి భాగం**

వ్యవహరించారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన 15 నెలల్లోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాల భర్తీ త్వరగా పూర్తయితే ఉద్యోగం రానివారు మరో పని చూసుకుంటారని అన్నారు. ఉద్యోగాల భర్తీ త్వరగా జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని, కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. నోటి కాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్లుగా కేసులు వేస్తున్నారని, ఉద్యోగాలను అడ్డుకుంటున్న వారిని ప్రజలు నడి రోడ్డుపై నిలదీయాలని రేరూ. లక్ష ఇచ్చి ప్రోత్సాహం : వంత్ రెడ్డి అన్నారు. రూ. లక్ష ఇచ్చి ప్రోత్సాహం : ఆరు నెలలు కూడా విరామం లేకుండా వాళ్ల (బీఆర్ఎస్) ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారని, విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ. లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

# రాజ్యసభకు కమల్ హాసన్

- డీఎంకే అధికారిక ప్రకటన
- 8 రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. ఎంఎన్ఎం పార్టీకి ఒక రాజ్యసభ సీటను ఇస్తున్నట్లు తమిళనాట అధికార పార్టీ డీఎంకే ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ట్వీట్ చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఒప్పందం ప్రకారం కమల్ పార్టీకి ఎగువ సభ స్థానాన్నిసీఎం స్టాలిన్ కేటాయించారు. ఈ క్రమంలో ఎంఎన్ఎం పార్టీ అభ్యర్థిగా కమల్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనం కానుంది. ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఆరు సీట్లు ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీలం 2025 జూలై 25న ముగియనుంది. నామినేషన్ల దాఖలు ప్రక్రియ జూన్ 2న ప్రారంభమవుతుంది. ఆరు సీట్లకు గానూ 4 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు డీఎంకే ప్రకటించింది. అందులో ఒక స్థానానికి ఎంఎన్ఎంకు కు కేటాయించింది. ఇప్పటికే రాజ్యసభ ఎంపీగా ఉన్న న్యాయవాది విల్సన్‌కు డీఎంకే మరోసారి అవకాశం ఇచ్చింది. మిగిలిన రెండు స్థానాలకు ఎస్ఆర్ శివలింగం, రుక్కయ్య మాలిక్ అలియాస్ కవిగ్నార్ సల్మాను కేటాయించినట్లు ప్రకటనలో పేర్కొంది. 2018లో కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత జరిగిన ఒప్పందంలో భాగంగా 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. దీంతో జరగనున్న ఎన్నికల్లో కమల్ హసన్ పోటీ చేయనున్నారు. తమిళనాడులో అధికారిక డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దాంతో ఈ నాలుగు స్థానాల్లో విజయం సాధిస్తుందని తెలుస్తోంది. మరోవైపు అన్నాడీఎంకేకు ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఒకే ఒక్క రాజ్యసభ ఎంపీ గెలుస్తుంది. ఒకవేళ మరో అభ్యర్థిని కూడా గెలిపించుకోవాలని అన్నా డీఎంకే భావిస్తే అది బీజేపీ, పీఎంకే ఎమ్మెల్యేల సహకారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. బీజేపీ ప్రస్తుతం అన్నాడీఎంకే పక్షానే ఉంది. దీంతో తప్పకుండా ఇరుపార్టీలు సహకరించుకుంటాయి.

# పద్మశ్రీ బాధ్యతను మరింత పెంచింది

**తరువాయి భాగం**



గ్రహీత మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. పద్మశ్రీ పురస్కారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు, ఉద్యమానికి దక్కిన గౌరవమని, జాతికి అండగా ఉన్న సమాజానికి వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని అన్నారు. లక్ష్యం కోసం పనిచేస్తే గుర్తింపు, గౌరవం వస్తుందనడానికి తనకు వచ్చిన పురస్కారమే నిదర్శనమని మంద కృష్ణ అన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ, వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి, చంద్రబాబు.. వర్గీకరణ లక్ష్యానికి చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంద కృష్ణ అన్నారు. పద్మశ్రీ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజానికి రుణపడి ఉన్నామని, ఎమ్మార్పీఎస్ లక్ష్యం వర్గీకరణ అయినప్పటికీ సమాజం కోసం అనేక పోరాటాలు చేస్తున్నామని అన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు సంబంధం లేకుండా స్వతంత్ర్యం అనంతరం అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెడతామన్నారు. ప్రజా ఆకాంక్షలకు అణుగుణంగా ముందుకు వెళతామని, మేధావులు, సంఘాలు, రాజకీయ వర్గాలతో చర్చించి భవిష్యత్ అజెండా రూపొందించుకుని ముందుకు వెళతామని స్పష్టం చేశారు. దేశంలో పెండింగ్ సమస్యలపై పోరాడతామని, ఆర్ఎస్ఎస్ నుంచి ఎర్రజెండా మేధావుల వరకు అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు.

కాగా రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడైన మందకృష్ణ మాదిగ తన అవిశ్రాంత పోరాటంతో ఎస్సీ ఉపవర్గీకరణను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించడంలో కీలకపాత్ర పోషించారని అవార్డుతోపాటు అందజేసిన ప్రశంసాపత్రంలో రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



జూన్ 8 వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో చేయాల్సిన ఏర్పాట్ల పై సచివాలయంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ వివిధ విభాగాల అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లో 185 సంవత్సరాలుగా ఉబ్బస వ్యాధిగ్రస్తులకు బత్తిని సోదరులు పంపిణీ చేస్తున్న చేప ప్రసాదం పై ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. లక్షలాది మంది పాల్గొనే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో పోలీసులు పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీస్ అధికారులకు సూచించారు. ఈసంవత్సరం చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేప పిల్లలను ఏర్పాటు చేసినట్లు ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు తెలిపారు. చేప పిల్లల ఖర్చును నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ భరించాలని సూచించారు. వచ్చే భక్తులకు క్యూ లైన్ లో ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ,మహిళలకు వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ పాస్ లు లిమిట్ గా పెట్టడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని సూచించారు.

చేప ప్రసాదం కోసం బయట రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండడంతో వారికి సరిపడ తాగునీటి సౌకర్యాలు , టాయిలెట్స్ ఏర్పాటు , స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే బోజన సౌకర్యాలకు ఇబ్బందులు లేకుండా వారికి జీహెచ్ఎంసీ నుండి సహకారం అందించాలని పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ చుట్టూ పది పార్కింగ్ ప్రదేశాలు ఏరోటి చేసినట్టు వెల్లడించారు. వాహనాలు మొరాయించినప్పుడు వాటిని తీసుకెళ్లడానికి క్రేన్ వాహనాలు సిద్ధం చేసుకోవాలని సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఉండేలా చూడాలని,మొబైల్ టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు.గార్బేజ్ తరలింపునకు వాహనాలు సిద్ధం చేయాలని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ లు ఫిష్ పర్యవేక్షణ చేస్తారని , ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పర్యవేక్షణ ఉంటుందని అధికారులు మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. దూద్ బౌలి, నాంపల్లి లో కరెంట్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి రావడం కోసం ఆర్టీసీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ ,చర్లపల్లి నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. చేప ప్రసాదం పంపిణీ జరిగే ప్రదేశాల్లో వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ,నాలుగు హెల్త్ క్యాంపులు ,నాలుగు అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. చేప ప్రసాదం వేసే వాలంటీర్లకు సీపీఆర్ శిక్షణ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. చేప ప్రసాదం కోసం టోకెన్ లకు అదనపు కౌంటర్ లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఐ అండ్ పీఆర్ ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వడం చేప ప్రసాదం కోసం వచ్చే సౌకర్యాలు తదితర వాటిపై చూసుకోవాలని తెలిపారు. లయన్స్ క్లబ్ ,NCC నుండి వాలంటీర్ లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్ లను కోఆర్డినేట్ చేసుకోవడానికి 20 ప్రాంతాల్లో ఒక ఆర్డీవో,ఒక అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సమీక్షా సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి,అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి,రెవెన్యూ ,హెల్త్,ఫైర్, వాటర్ వర్క్, ఆర్ అండ్ బి , బత్తిని కుటుంబ సభ్యులు బత్తిని అమరనాథ్ గౌడ్ , గౌరీ శంకర్ ,చంద్రశేఖర్ ,శివ శంకర్ , సంతోష్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# యుగ పురుషుడు ఎన్టీఆర్

**తరువాయి భాగం**

పురుషుడును స్మరించుకున్నారు. ఎన్టీఆర్ కుమారునిగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాని రామకృష్ణ చెప్పారు. తెలుగు వారికి, మన రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిందని నందమూరి తారక రామారావు అని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎన్టీఆర్ అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో నిలిచారని పేర్కొన్నారు. తిరుపతిరస్వామి సన్నిధిలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినది ఎన్టీరామారావుని గుర్తు చేశారు. స్వర్గీయ ఎన్టీ ఆర్ గురుంచి ఆయన అందించిన సేవలు గురించి ఎంత చెప్పుకున్నా ఈ జన్మసరిపోదని ఆయన కొనియాడారు. ప్రజలకోసం ఏ ఉద్దేశంతో అయితే పార్టీపెట్టారో వాటిను తూచా తప్పకుండా అమలు పరుస్తూ ఆయన ఆశయాఆశయాలనులను సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. చిన్ననాటినుంచి ఆయన సినిమాలు ఆయన ప్రజలకు అందించిన మంచిపనులు చూసి పెరిగానని సినీదర్శకుడు అన్న వీరాభిమాని వైవీఎస్ చౌదరి అన్నారు. పురాణపాత్రల్లో నటించి ప్రజల గుండెల్లో దేవుడిగా ఇప్పటికీ ఉన్నారంటే ఆయన ఖ్యాతి అజరామమని కొనియాడారు. అన్నా అనే పదానికి నిర్వచనం ఎన్టీఆర్ నాటినుంచే వచ్చిందని గుర్తు చేశారు.

# రైతులకు గుడ్‌న్యూస్

**తరువాయి భాగం**

క్వింటాల్‌కు రూ.175 పెంచినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కందిపప్పు క్వింటాల్‌కు రూ.450, పెసర్లు క్వింటాల్‌కి రూ.86, మినుములు క్వింటాల్ రూ.400, వేరుశెనగ క్వింటాల్ రూ.480 పెంచినట్లు వివరించారు.పొద్దుతిరుగు క్వింటా రూ.441, సోయాబీన్ క్వింటా రూ.436, కుసుములు క్వింటా రూ.579, వలిసెలు క్వింటాల్‌కి రూ.820, పత్తి క్వింటాల్‌కు రూ.589 పెంపు, నువ్వులు క్వింటాల్‌కు రూ.579 పెంచినట్లు చెప్పారు. అలాగే, బద్వేల్‌నెల్లూరు నాలుగు వరుసల రోడ్డుకు రూ.3,653 కోట్లు కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ - కృష్ణపట్నం ఓడరేవుకు, హెచ్‌హెచ్ 67లోని ఓ భాగానికి ఓడరేవు కనెక్టివిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్ల కలుపనున్నది. దాదాపు సుమారు 108 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారి నిర్మాణం జరుగనుండగా.. వార్ధాబల్లార్షా నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది.

# తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా అపరేష్ కుమార్

- ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా అపరేష్ కుమార్
- హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ


**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణహైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు.

# రాష్ట్రంలో ఆర్టీఐ చట్టం పనిచేస్తోందా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దేశంలో రైట్ టు ఇన్ఫర్మేషన్ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చిందని, కానీ ఇప్పుడు తెలంగాణలో అసలు ఆర్టీఐ చట్టం పనిచేస్తోందా? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమయ్యాయని, కాగా రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ సైతం వారి అడుగుజాడల్లోనే నడుస్తోందని ఆమె విమర్శలు చేశారు. ఈ ఏడాది జనవరి 31న బీజేపీ తరపున ఆర్థికశాఖకు సంబంధించిన 27 ప్రశ్నలతో కూడిన ఆర్టీఐ అప్లికేషన్ ఇచ్చామని, కానీ దానిపై ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఆపై 12 మార్చిన ఫస్ట్ అప్పీల్ దాఖలు చేశామని, అయిఆన ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. దీన్నిబట్టి ఆర్టీఐ.. తెలంగాణలో పనిచేయడం లేదని అర్థమవుతోందని, ప్రస్తుతం 16 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఇతర నాయకులు నిజాల లెక్కలు తెలియకుండా కేంద్రంపై నిందలు మోపుతూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఫైరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రాణిరుద్రమ డిమాండ్ చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
29.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ఉద్యమ కారులకే పదవులు

- జిల్లా కార్యవర్గ సభ్యులుగా భాష బోయిన సంతోష్.
- సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా ఉట్కూరి ప్రణీత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక..






**విశాలభారతి,ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండలం నుండి విద్యార్థి ఉద్యమ నాయకులుగా రాణించి 26, 27 తేదీలలో సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభలో భాష బోయిన సంతోష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, ఉట్కూరి ప్రణీత్ గౌడ్ సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయం. గత కొన్ని సంవత్సరాలుగా ఎల్కతుర్తి మండలం నుండి విద్యార్థి ఉద్యమంలో ప్రయాణం మొదలుపెట్టి అనేక రకాల ఉద్యమాలు, పాఠశాల సమస్యలపై, హాస్టల్ సమస్యలపై స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదలపై ఎన్నో రకాల ఉద్యమాలు చేసి ఎన్నో కేసులు మీద వేసుకొని చివరికి జైలు జీవితం గడిపి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎనలేని కృషి చేస్తూ జిల్లా స్థాయిలో విద్యార్థి ఉద్యమంలో గుర్తింపు తెచ్చుకున్న ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామం ముద్దుబిడ్డ ప్రస్తుతం ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కామ్రేడ్ భాష బోయిన సంతోష్ సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనందున అదేవిధంగా ఎల్కతుర్తి మండలం గోపాల్ పూర్ ముద్దుబిడ్డ ప్రస్తుతం ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉట్కూరు ప్రణీత్ గౌడ్ సిపిఐ హనుమకొండ జిల్లా సమితి సభ్యునిగా ఎన్నికైనందున ఇది మన ఎల్కతుర్తి మండలానికి గర్వకారణం అని వారు మరింత విద్యార్థి ఉద్యమంలో సిపిఐ పార్టీలో అంచలంచలుగా ఎదిగి పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని పోరాటాలు నిర్వహించాలని కోరుకుంటూ వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు




# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్రావు

**విశాలభారతి, రాజేందర్ నగర్:**

రాష్ట్రాన్ని డ్రగ్స్ రైతు రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్రావు అన్నారు రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న గణితము ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు రాజేంద్రనగర్ పట్టణంలో ఎడిఫై పాఠశాల నందు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరికీ ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ శిబిరం కొనసాగుతుంది శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు తెలంగాణ ప్రభుత్వ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం కోసం ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి లోను కాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఉపాధ్యాయులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ శిక్షణ కార్యక్రమంలో డ్రగ్స్ వాడకం వల్ల జరుగు అనర్థాలు విద్యార్థులకు తెలియజేయడం విద్యార్థులలో డ్రగ్స్ రహిత సమాజం అంశం పైన అవగాహన కల్పించడం అనే అంశంలో అంశాలతో ఉపాధ్యాయులకు పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా శిక్షణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యం గా పేర్కొన్నారు విద్యార్థి దశ నుంచి డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంచడానికి పాఠశాల నుండే విద్యార్థులలో అవగాహన కల్పించాలని డ్రగ్స్ వినియోగంపై జరిగే అనార్థాలపై విద్యార్థులకు బేషరత్తుగా తెలిసే విధంగా చర్యలు చేపట్టాలని ఇది అందరి బాధ్యత అని అన్నారు రాబోయే రోజుల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత అందరి ఉపాధ్యాయుల పైన ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ కోర్సు డైరెక్టర్, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కేంద్ర కేబినెట్ ఐదుకీలక నిర్ణయాలు

- రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రైతులతో పాటుగా దేశంలోని రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వరి, పత్తి, జొన్న, వేరుశనగ, కంది పప్పు పండించే రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఆర్థిక వ్యవహారాల కేంద్ర కేబినెట్ నిర్ణయం ప్రకారం.. వరి కనీస మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369 కి పెరిగిందని, 201314 కనీస మద్దతు ధరతో పోల్చుకుంటే ఇది 81 శాతం ఎక్కువ అని వివరించారు. పత్తిపై క్వింటాలుకు రూ.589 పెరిగిందన్నారు. దీంతో తెలంగాణ మార్కెట్లో క్వింటాలుకు రూ.7,210 రూపాయలుగా ఉన్న పత్తి ధర.. తాజా నిర్ణయంతో.. రూ.7,710కు పెరిగిందని, 201314తో పోలిస్తే ఇది 108 శాతం పెంపు చేసినట్లని తెలిపారు. పొడవైన రకం పత్తి కనీస మద్దతు ధర కూడా ఇప్పుడు రూ.8110కి చేరిందని స్పష్టంచేశారు. వేరుశనగ కనీస మద్దతు ధర రూ.480, కంది పప్పు కనీస మద్దతు ధర రూ.450 పెరిగిందని తెలిపారు. జొన్న పంటపై కనీస మద్దతు ధర రూ.328, మొక్కజొన్నపై రూ.175, నువ్వులపై రూ.579 పెరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. పంట ఉత్పత్తి వ్యయానికి కనీస మద్దతు ధర కనీసం 1.5 రెట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని 201819 బడ్జెట్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం.. ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి తగ్గట్లుగానే.. దాదాపుగా అన్ని పంటలకు 1.5 శాతానికి పైగానే మద్దతు ధరలను మోడీ సర్కారు పెంచినట్లు తెలిపారు.

## ఆర్జీయూకేటీలో ప్రవేశ నోటిఫికేషన్ విడుదల

విశాలభారతి, స్టేట్ బ్యూరో:బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్సలర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. బాసర సెంటర్‌లో 1500ల సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లకు ఆరేండ్ల సమీకృత విద్యావిధానంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పటయిందని, ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని అన్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలను ట్రిపుల్ ఐటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ డాక్టర్ దేవరాజ్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, మంతపురి హరికృష్ణ పాల్గొన్నారు

# పేటలో పిల్లల అక్రమ రవాణా ముఠా అరెస్ట్

- 18 మంది సభ్యులను అదుపులోకి తీసుకున్న సూర్యాపేట పోలీసులు.
- ఈ ముఠా సభ్యులు 28 మంది పిల్లలను అక్రమ రవాణా చేసినట్టు గుర్తింపు.
- జువెనల్ జస్టిస్ ఆక్ట్ 2015 ప్రకారం కేసు నమోదు.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ.




**సూర్యాపేట, విశాలభారతి:**

పిల్లల అక్రమ రవాణా ముఠాను సూర్యాపేటలో పోలీస్ లు అరెస్ట్ చేశారు. కేసు కు సంబందించిన వివరాలను సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుధవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు అక్రమ దత్తతలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా దత్తత తిసుకున్న అంజయ్య, నాగయ్యలను అరెస్టు చేసి వారి ఒప్పుకోలు ఆధారంగా నిందితులు ఏ1, ఏ2 లను అరెస్టు చేశామన్నారు .అదే విధంగా అక్రమ దత్తత గురించి చర్చించడానికి శిశువుల అక్రమ రవాణా ముఠా బృందం సూర్యాపేటకు వచ్చారని, వారు ఇప్పుడు సూర్యాపేటలోని హైటెక్ బస్టాండ్ లో అందుబాటులో ఉన్నారని తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితులు ఏ3 నుండి ఏ13 వరకు అరెస్ట్ చేయడం జరిగినదనీ ఎస్పీ చెప్పారు. వారి తల్లిదండ్రులను కూడా అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.13 మంది సభ్యులు కలిగిన పిల్లల అక్రమ రవాణా ముఠాను అరెస్టు చేశామన్నారు. సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన వివిధ గ్రామాల నుండి 7 మంది మగ శిశువులు,3 మంది ఆడ శిశువులు, టేకుమట్ల 9 బాలురు శిశువులు, సూర్యాపేట పట్టణం 2 బాలికల శిశువులు, పెన్ పహాడ్ 1 బాలుర శిశువులు, సూర్యాపేట జిల్లా ఉప్పలపహాడ్ 2 బాలుర శిశువులు, నల్గొండ జిల్లాకు చెందిన చిన్న సూరారం 1 బాలిక శిశువు, హైదరాబాద్ 1 బాలుర శిశువులను రక్షించి పిల్లలందరినీ నల్గొండలోని బాలల సంక్షేమ కేంద్రానికి అప్పగించామని ఎస్పి వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని యాదగిరి, ఉమారాణి అనే ఒక వ్యక్తులు గుడ్ల పంపిణీ వృత్తిని చేస్తూ పిల్లలు లేని తల్లి దండ్రుల గురించి తెలుసుకొని ఆడ,మగ శిశువులను బట్టి వారి కమీషన్ 10 వేల నుండి 2 లక్షల వరకు కలిపి మొత్తం 5 నుండి 10 లక్షల వరకు బేరం కుదుర్చుకొని అక్రమంగా దత్తత తీసుకున్న పిల్లలను వారికి అందించేవారన్నారు. పైన పేర్కొన్న గ్రామాలను సందర్శించి, ఏ3 నుండి ఏ12 ల ద్వారా మధ్యవర్తిత్వం ద్వారా శిశువులను క్రింద పేర్కొన్న తల్లిదండ్రులకు పిల్లలను అక్రమంగా దత్తత ఇచ్చేవారనీ, ఏ13 కారు డ్రైవరు అతనికి కూడా పై విషయాలు అన్నీ తెలుసని ఎస్పీ వెల్లడించారు. తదుపరి నేరస్థులను సూర్యాపేట కోర్టు ముందు హాజరు పరుచడం జరుగుతుందన్నారు. సూర్యాపేట డిఎస్పీ నేతృత్వంలో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపర్చిన సిసియస్ సూర్యాప్టేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం.శివ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.రాజశేఖర్, సూర్యాపేట పెన్ పహాడ్ పోలీస్ ఇన్స్పెక్టర్ పి.హరి కృష్ణ, సూర్యాపేట రూరల్ సిసియస్ ఎస్ ఐ హరి కృష్ణ, పెన్ పహాడ్ పోలీస్ ఎస్ఐ కె. గోపి కృష్ణ,చివ్వెంల ఎస్ఐ వి.మహేష్, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు నాయక్, సిసియస్ సిబ్బంది లను ఎస్పి అభినందిచారు.



# ఎన్డీఎస్ఏ నివేదిక తప్పులతడక

**తరువాయి భాగం**

తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం అత్యంత దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్ - బీజేపీ, ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో.. దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ - బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అని కేటీఆర్ అన్నారు. జై కిసాన్.. జై కాళేశ్వరం.. జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.

## వేసవి సెలవుల్లో బదిలీలు, ప్రమోషన్ల

# ప్రక్రియ పూర్తి చేయాలె

- సీఎం రేవంత్ రెడ్డికి టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య లేఖ



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు వేసవి సెలవుల్లోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని 'కరీంనగర్' టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని కోరారు. దీనికి అనుగుణంగా వెంటనే గైడ్ లైన్స్, షెడ్యూల్ రిలీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా డీఎస్సీ 2003 టీచర్లందరికీ ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీచర్లందరికీ సీపీఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని, ఆ టీచర్లకూ ప్రమోషన్లు కల్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న పీఈటీ, లాంగ్వేజీ పండిట్లకు వెంటనే అప్గ్రేడ్ చేయాలని కోరారు. టీచర్లకు వివిధ రకాల బిల్లులు నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయనీ, వాటిని వెంటనే రిలీజ్ చేయించాలని డిమాండ్ చేశారు. టీచర్లకు, ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. ప్రైమరీ స్కూల్, యూపీఎస్ స్కూళ్లలోని టీచర్లకూ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. పదివేల ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# చురుకుగా కదులుతున్న రుతుపవనాలు...

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ ముఖ్యమైన సమాచారం అందించింది. నైరుతి రుతుపవనాలు బుధవారం (మే 28) నాటికి రాష్ట్రమంతటా పూర్తిగా విస్తరించాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఈ పరిణామంతో రానున్న రెండు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, దీనికి తోడు బలమైన ఈదురు గాలులు కూడా వీస్తాయని ఆయన తెలిపారు.ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా గోదావరి, నాగావళి, వంశధార నదులకు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని కూర్మనాథ్ హెచ్చరించారు. ఈ నదీ పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలు తక్షణమే అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగానికి ఇప్పటికే అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు, నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల సమీపంలోని ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. ఈ హెచ్చరిక బోర్డులపై సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సహాయం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాలని కూడా సూచించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
29.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేశాం: ఇజ్రాయెల్

యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులకు ఇజ్రాయెల్ గట్టి ప్రతిస్పందన ఇచ్చింది. ఇజ్రాయెల్ భూభాగం లక్ష్యంగా హూతీలు రెండు క్షిపణులను ప్రయోగించిన నేపథ్యంలో, బుధవారం నాడు యెమెన్ రాజధాని సనాలోని విమానాశ్రయంలో ఉన్న హూతీ గ్రూపునకు చెందిన లక్ష్యాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో కీలకమైన ఆస్తులు ధ్వంసమైనట్లు సమాచారం.ఈ వైమానిక దాడులపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ స్పందించారు. "సనా విమానాశ్రయంలోని హూతీ ఉగ్రవాద సంస్థకు చెందిన ఉగ్రవాద లక్ష్యాలపై వైమానిక దళ యుద్ధ విమానాలు దాడి చేశాయి. అక్కడ మిగిలి ఉన్న చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేశాయి" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. "ఇజ్రాయెల్ దేశంపై కాల్పులు జరిపేవారు ఎవరైనా సరే, భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇది మా విధానం, ఇది వారికి స్పష్టమైన సందేశం" అని కాట్జ్ తీవ్రంగా హెచ్చరించారు. సనా విమానాశ్రయంపై ఇజ్రాయెల్ దాడులు జరిపిన విషయాన్ని హూతీ మీడియా కూడా ధృవీకరించింది. అంతకుముందు, మంగళవారం నాడు యెమెన్ నుంచి ఇరాన్ మద్దతు ఉన్న హూతీ గ్రూపు ఇజ్రాయెల్ వైపు ఒక క్షిపణిని, మరో ప్రొజెక్టైల్‌ను ప్రయోగించింది. అయితే, ఈ రెండింటినీ ఇజ్రాయెల్ విజయవంతంగా అడ్డగించింది. తాము ఇజ్రాయెల్ వైపు రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు హూతీలు ఆ తర్వాత ప్రకటించారు. అక్టోబర్ 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి, అనంతరం గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి, పాలస్తీనియన్లకు మద్దతుగా హూతీలు ఇజ్రాయెల్‌పై తరచూ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్నారు.





# ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు ప్రకారమే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

**తిరుమలగిరి, విశాలభారతి:**

ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారమే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం తిరుమలగిరి మండలం కొక్యతండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను 600 చదరపు అడుగులలో మాత్రమే నిర్మించుకుంటేనే 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయంకు అర్హులు అవుతారని తెలిపారు. ఇస్లావత్ యాకమ్మ, ఇస్లావత్ జగన్ లు నిర్మిస్తున్న ఇండ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్,సివిల్ సప్లై డి యం ప్రసాద్, ఎంపిడిఓ ప్రసాద్, ఏపీఎం మధు, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి కిరణ్, సెంటర్ ఇంచార్జి సురేందర్,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏర్పుల నరసింహ
- జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలి
- మే 30న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్నటువంటి బిళ్ళలను వెంటనే చెల్లించాలని కోరిన సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏర్పుల నరసింహ ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న బిల్లులని వెంటనే చెల్లించాలని కోరారు,లేనియెడల ప్రభుత్వ కార్యాలయాలపై రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేయవలసి వస్తుందని అన్నారు, ఈనెల 30వ తేదీన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ల ముందు నిర్వహించనున్న ధర్నాని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ తరపున పిలుపునిచ్చారు, అబ్దుల్లాపూర్మెట్ మండలం సుర్మాయిగూడ, గండి చెరువు గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది అని అన్నారు, గత రెండు నెలలుగా బిల్లు రావడం లేదని, కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని ఉద్దేశంతో గత ప్రభుత్వం ఇచ్చినటువంటి సౌకర్యాలను అందజేయకుండా బిజెపి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేలని చూస్తుందని అన్నారు, సకాలంలో బిల్లులు చెల్లించకపోతే విరక్తితో వాళ్ళంతట వాళ్లే పని మానేసే విధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని జాతీయ ఉపాధి హామీ పథకం కింద అదనంగా నిధులు కేటాయించి వందరోజుల పనిని 200 రోజులు చేస్తూ కొలత పద్ధతి తీసివేసి కూలీ 600రూ "లు ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని కూలి రేట్లు పని దినాలు పెంచాలని ఈ నెల 30వ తేదీన రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు ఉపాధి కూలీలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వర్గాల ముత్యాలు,కూలీలు అనూష,సుజాత, ఇందిరా, పోచమ్మ,రాజమణి,అనిత, చంద్రకళతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ కాగర్ తో బూటకపు ఎన్కౌంటర్లు

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందరూ రవీంద్ర చారి
- రాజీవ్ గృహకల్ప శాఖ మహాసభకు హాజరైన సిపిఐ నేతలు

**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:**

ఆపరేషన్ కగాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్కౌంటర్లకు పాల్పడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందరూ రవీంద్రాచారి అన్నారు, రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపల్ పరిధి పుండ్లు రాజీవ్ గృహకల్ప శాఖ మహాసభ కామ్రేడ్ జాబుల రాములు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందరూ రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కాకరతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్కౌంటర్లకు పాల్పడుతున్నారన్నారు చతిస్గడ్ ఎన్కౌంటర్లో పట్టుకొని కాల్చి చంపారని కనీసం మృతి చెందిన వారి భౌతిక కాయాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా పోలీస్ వారే సామూహిక దహనాలు చేయడమేంటని ప్రశ్నించారు, శాంతి చర్చలకు అంగీకరించకుండా మొండికేయడం దుర్మార్గ మన్నారు, ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కాదన్ను వెంటనే ఆపి చర్చలు జరపాలని ప్రభుత్వలను డిమాండ్ చేశారు,సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంతరాలు లేని సోషలిస్ట్ సమాజమే ధ్యేయంగా పనిచేయాలన్నారు, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వాలు మారిన ప్రజల తలరాతలు మారలేదని వారికి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు అందుకే ప్రజల తరపున ప్రజా ఉద్యమాలు నిర్మించి పోరాడుతామని హెచ్చరించారు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రభుత్వ నియంత్రణ లేదని అన్నారు ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నర్సింగ్ నాయక్,యాదయ్య, ప్రజానాట్యమండలి నాయకులు గణేష్,రాము, వెంకట్,బాలు,వలి,నరసింహ, శీను,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





# రామచంద్రారెడ్డి నగర్ లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి

- రూ.50 లక్షలతో నూతన డ్రైనేజీ పైపు లైన్లు
- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్
- రామచంద్రాపురంలోని లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన కార్పొరేటర్, అధికారులు

**పటాన్ చెరు,విశాలభారతి**

రామచంద్రాపురం డివిజన్లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలలోని డ్రైనేజ్ పైప్ లైన్లు నిండి, రోడ్లు జలమయమై ఇళ్లలోకి చేరాయి. కాలనీవాసులు కార్పొరేటర్ పుష్ప నగేష్ కు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరగా, వెంటనే స్పందించిన కార్పొరేటర్ రాత్రి 12 గంటల సమయంలో జెసిబిని, అధికారులను పంపించి పరిస్థితిని అదుపులోనికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. మళ్ళీ ఉదయం 6 గంటలకు వివిధ శాఖల అధికారులను వెంటబెట్టుకొని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో పర్యటించారు. కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరాయని, ఇక ముందు వచ్చే వర్షాకాలంలో పెద్ద వర్షాలు కురిస్తే ఇబ్బందికరంగా ఉంటుందని కాలనీవాసులు కార్పొరేటర్ తో చెప్పారు.వెంటనే శాశ్వత పరిష్కారానికి రూ.50 లక్షలు వెచ్చించి నూతన డ్రైనేజ్ పైప్ లైన్లను వేయిస్తానని కార్పొరేటర్ కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ఇబ్బందులు తలెత్తకుండా లెవలింగ్ తో కూడిన నూతన డ్రైనేజీ పైప్ లైన్లను వేయాలని అధికారులను కార్పొరేటర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఈఈ సురేష్, డిఈ నరేందర్, ఏఈ దివ్య, డాక్టర్ విజయ్, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ సూపర్వైజర్ నాయక్, కాలనీవాసులు వాసుదేవ్, భుజంగ రెడ్డి, వీరారెడ్డి, యాదయ్య, విటల్ రెడ్డి, గోపాలకృష్ణ, గోకుల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

- ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో
- ఘనంగా ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు.

**సూర్యాపేట,విశాలభారతి:**

మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు, విశ్వ విఖ్యాత నట సార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 వ జయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ సూర్యాపేట అభిమాన సంఘం నాయకులు నేరేళ్ల మధు గౌడ్ ఆధ్వర్యంలో జ బుధవారం జిల్లా కేంద్రంలోని నల్లాల బావి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం కేక్ కట్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న పాత్రలో నటుడిగా తెలుగుజాతి వారికి సుపరిచితుడని అన్నారు. ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన హయాంలో అనేక సంస్కరణలు, రిజర్వేషన్లు అమలు చేసి బడుగు బలహీన వర్గాలకు ఫలాలు అందేలా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, గోపగాని కగిరిగౌడ్, కొండగడుపుల సూరయ్య, తప్పెట్ల శ్రీరాములు, గునగంటి మధు, కారింగుల వేణు, కొండా రాజీవ్, పోలగాని ఉపేందర్, ఎలుగూరి వెంకటేశ్వర్లు, గునగంటి వెంకటేశ్వర్లు, గునగంటి కృష్ణ,తోట శ్రీను, పొదిళ్ల హరిరామ ప్రసాద్,నేరేళ్ల జానీ తదితరులు పాల్గొన్నారు.



మణి గార్డెన్ పంక్షన్ హాల్ బుధవారం దోటి నగేష్ యాదవ్ అనూష గారి కుమార్తె,కుమారుడు గంగ భవాని, స్వామి గార్ల నూతన పట్టు వస్త్ర అలంకరణ మహోత్సవంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం ,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మదనబోయిన పరమేష్ ,అయితగోని విజయ్, బోయపర్తి సురేందర్, వరంగంటి శంకర్ , బండారు శ్రీనివాస్, కొమ్ము మల్లేష్ , బోయపర్తి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

**మునుగోడు, విశాలభారతి:**



# చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం

- రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్,

**సూర్యాపేట,విశాలభారతి:**

చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలో శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 2025 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలో 450 మార్కులు కంటే ఎక్కువ మార్కులు సాధించిన 127 మంది యాదవ విద్యార్థులకు మొత్తం 4 లక్షలు నగదు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నీజాయితీ గల యాదవులు విద్య, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం కావాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు గ్రంథాలయల్లు, టీవీ ల ద్వారా విజ్ఞానం పొందాలని కోరారు. విద్యార్థులు 10వ తరగతి తరువాత 5 ఇయర్స్ కష్టపడి, ఇష్టపడి చదవాలనారు. లగ్జరీ జీవితం కావాలంటే చదువు తో నే సాధ్యమని పేర్కొన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సూర్యాపేట జిల్లా యాదవ్ విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. శ్రీ కృష్ణ సేవా ట్రస్టు ను మరింత బలోపేతం చేయాలన్నారు. ముందుగా నకిరేకల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య యాదవ్ కేరీర్ గైడన్స్ అవగహన పై కలిపించారు. ఈ కార్యక్రమం కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, ట్రస్టు సభ్యులు మర్యాద సైదులు యాదవ్, పోలేబోయిన నర్సయ్య యాదవ్, ఎలగబోయిన మధు యాదవ్, రాము యాదవ్, గొడ్డెటి సైదులు యాదవ్, మహేష్ యాదవ్, వజ్జె వీరయ్య యాదవ్, ఊర గాయత్రి యాదవ్, సుంకర బోయిన వెంకన్న యాదవ్, తూము వెంకన్న యాదవ్, శ్రీమాన్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# కోరిన కోర్కెలు తీర్చే కొండంత దైవం శ్రీ పశుపతి నాథుడు

- మోకాళ్లపై ప్రదక్షిణలు చేసి మొక్కలు చెల్లించిన భక్తులు

**విశాలభారతి,ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోనీ వల్భాపూర్ గ్రామం శ్రీ పశుపతినాథ్ స్వామి దేవాలయంలో వైశాఖ మాస అమావాస్య రోజు స్వామి వారికి పంచామృత అభిషేక పూజలు చేసి మోకాళ్లపై ప్రదక్షిణలు చేసి వారి మొక్కను చెల్లించు కున్నారని ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి తెలియజేశారు ఎవరెవరు ఏమేమి మొక్కలు మొక్కుకుని స్వామివారికి మోకాళ్లపై ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించుకోవడం ద్వారా స్వామివారు వారి కోర్కెలను తప్పక నెరవేస్తారని భక్తుల




నమ్మకం అని అలాగే పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందించామని ఆలయ అర్చకులు తెలియచేశారు ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
29.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## రైతుల వద్దకే వ్యవసాయ శాస్త్రవేత్తలు

**గరిడేపల్లి, విశాలభారతి:**




వికసిత్ కృషి సంకల్ప అబియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రయోగశాల నుంచి భూమికి అనే నినాదంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు రైతుల వద్దకే వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం,గడ్డిపల్లి. సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జ్, డి.నరేష్ తెలిపారు. రోజూ 3 గ్రామాలు చొప్పున 23 మండలాల్లోని గ్రామాలను హైదరాబాదు నుండి ఐ.సి.ఏ.ఆర్ శాస్త్రవేత్తలు, కే. వి.కేగడ్డపల్లి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు & వ్యవసాయ విస్తరణ అధికారులు మూడు బృందాలు గా ఏర్పడి గ్రామాలలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా రాబోయే వానకాలంకి అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.



## జై జవాన్ జై కిసాన్ పేరుకే వాదనలు పట్టించుకోని ఆవేదనలు

- **నోటికి కూడు అందించే చేతులే అధికారుల కాళ్లు పట్టిన వేళ**

**నర్సింహులు పేట, విశాలభారతి:**

మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పి ఎసిస్ఎస్ వరి కొనుగోలు కేంద్రంలో 40 రోజుల క్రితం ధాన్యం పోశామని ఇప్పటి దాకా కాంటాలు కావడం లేదని ధాన్యం కొనుగోలు చెయ్యకపోవడంతో అకాల వర్షంతో వరి కొనుగోలు కేంద్రంలో మధ్య వృత్తుల మోసంతో రాజకీయ ఒత్తిడికి చేతికొచ్చిన పంట జేబుదాకా రాకపోయే అని తమ గోస పట్టించుకున్న నాథుడే లేదని పిచ్చిరాం తండాకు చెందిన గిరిజన మహిళ రైతులు భూక్య గోరి, భూక్య ఈరి, స్థానిక తహసిల్దార్ కాళ్లు పట్టుకొని వేడుకున్నారు. ఈ సంఘటనపై పూర్తి సమాచారం తెలుసుకోని స్థానిక తహసిల్దార్ రమేష్ బాబు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా తమ ధాన్యాన్ని గిట్టుబాటు ధర కల్పించి సహకరిస్తూ న్యాయం చేస్తామని బాధిత స్థానిక రైతులకు హామీ ఇచ్చారు.




## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నిరసన

- **ఇబ్రహీంపట్నం డిపో ఎదుట బైఠాయింపు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పై జేఏసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బస్సు డిపో ముందు ఆర్టీసీ కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలైన ఆర్టీసీ బస్సు కిలోమీటర్లు పెంచడం, పని గంటలు పెంచడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సెలవులు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బందులు పెడుతూ చిన్న చిన్న విషయాల పై అక్రమంగా ఛార్జిషీట్ లు ఇవ్వడం సబబు కాదన్నారు. అదేవిధంగా సాలరీలు పెంచకుండా డిపో మేనేజర్ కార్మికుల పట్ల అవలంభిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ఈ సమస్యల పై ఆర్టీసీ జేఏసీ స్పందించి బుధవారం ఎర్ర బ్యాడ్జ్ లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## చెస్ తో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది

**సూర్యాపేట,విశాలభారతి:**

చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణా రెడ్డి, మైత్రి గ్లోబల్ స్కూల్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ నరసింహ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్ రోడ్డు నుండి పిల్లలమర్రి పోయే రోడ్డులో గల మైత్రి గ్లోబల్ స్కూల్ నందు మైత్రి గ్లోబల్ స్కూల్ అండ్ గ్లోబల్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో అండర్7, 9, 11, 13,15 విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన చెస్ పోటీలలో విజేతలకు నగదు బహుమతి, షీల్డ్ లను అందజేసి మాట్లాడారు.విద్యార్థులు నేడు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.చదరంగంతో వ్యూహాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, జ్ఞాపకశక్తి మెరుగు పడతాయని అన్నారు.విద్యార్థులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ నెమ్మాది వెంకటేశ్వర్లు, రాడికల్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనిల్ కుమార్, రిటైర్డ్ హెడ్మాస్టర్ కట్కూరి రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆఫ్ ఎంజి రామానుజన్ పాపయ్య, శ్రీనిధి కళాశాల కరస్పాండెంట్ పరుశురాములు, విప్లవ్ కుమార్, చీఫ్ ఆర్బిటర్స్ రవికుమార్, కిరణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**నారాయణపేట, విశాలభారతి:**

ఇటు రాజకీయరంగంలో అటు సినీ రంగంలో సాటిలేని మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని రెండు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హయాంలో బడుగు బలహీన వర్గాలకు చేయూతతో పాటు కూడు,గూడు,గుడ్డల నందించి తెలుగోడి ఘన కీర్తిని నలు దశల చాటిన మహానీయుడని ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకులు ఓం ప్రకాష్ ముదిరాజ్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలో ఓం ప్రకాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా శక్తి పీఠంలో పేదలకు మిఠాయిలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవ, మహేందర్, పెంటయ్య, భీమన్న,యాబన్న చౌదరి,వద్ది నారాయణ,కిష్టప్ప,రమేష్,భోప్ప తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- **నారాయణపేట జిల్లా అధికారులకు ఎంపీ డీ.కే.అరుణ దిశా నిర్దేశం.**

**నారాయణపేట, విశాలభారతి:**




కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులందరికీ ఆయా పథకాలను లబ్ధి చేకూర్చాలని పాలమూరు ఎంపీ,దిశ కమిటీ చైర్ పర్సన్ డీ.కే.అరుణ అన్నారు.బుధవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్య వేక్షణ కమిటీ దిశ రెండవ సమావేశానికి పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అధ్యక్షత వహించారు.కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు.మొత్తం 46 ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ జిల్లా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా,పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లోటు పాట్లు ఉంటే సరి చేసుకుని పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కాగా సమావేశంలో మొదటగా జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి 202021 నుంచి 20242025 వరకు కేంద్రం నుంచి జిల్లాకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు,ఎస్.ఎఫ్.సీ నిధుల వివరాలను వెల్లడించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ వైద్య శాఖ నివేదికలో భాగంగా జిల్లాకు విధించిన ఏ ఎన్ సీ,ఇమ్యూనైజేషన్,ఫ్యామిలీ ప్లానింగ్ స్టేరిలైజేషన్,ప్రసవాల టార్గెట్లు,అచివ్ మెంట్ల గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపుతోందని, మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి,డీ. ఎఫ్.వో అరవింద్,ఆర్డీఓ రామచంద్రనాయక్, జెడ్పీ సీఈవో శైలేష్ కుమార్,దిశ కమిటీ సభ్యులు లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్,పాండు నాయక్, కిరణ్, పడాకుల శ్రీనివాసులు, బలరాం రెడ్డి మరియు అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ శివాలయం జీర్ణోద్ధారణ

**దేవరుప్పుల, విశాలభారతి:**



మండలం సింగరాజుపల్లి గ్రామంలో శ్రీ శివాలయ పునరుద్ధరణ కమిటీ అధ్యక్షులు వంగాల వేణుగోపాల్ రెడ్డి సరళ, దంపతుల సహకారంతో, కాకతీయ కాలంనాటి పురాతనమైన వందల సంవత్సరాల క్రితం నాటి శివాలయం జీర్ణోధారణ (పునరుద్ధరణ) కోసం పండితులు నరేష్ శర్మ, మణికంఠ శర్మ, ప్రసాద్ వేదమంత్రాలతో పునర్ ప్రారంభంకు ముందు విగ్రహ ఉద్వాసన జరిపించి, జీర్ణోధారణ శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మందిరం కొత్తగా నిర్మించడం, సకాలంలో పూర్తి చేసుకొని ఆ భగవంతుడి సేవలకు దగ్గరవ్వాలని, అందరి సహాయ సహకారాలతో కృషితో కలిసి వైభవంగా తయారు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ లింగాల పరమేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ దాస్ మల్లేష్, కొండ పెద్ద మల్లారెడ్డి, మేకపోతుల. నరసింహ, నల్ల యాదగిరి,రచ్చ ఎల్లప్ప, మేకపోతుల రవి, కొమ్ము రాములు, నోముల వీరన్న,దాసగాని బిక్షపతి, వడ్లకొండ పద్మయ్య, గడ్డం రాజు, కత్తుల సోమిరెడ్డి, కొండ చిన్న మల్లారెడ్డి, మేడ రామయ్య, జట్టంగి పరశురాములు, ఊట్ల శివ, గర్దాస్ దామోదర్, ఊట్ల రాజు,అటికం నరసయ్య, మేకపోతుల సోమరాజు, మేడ యెశోబు,భక్తులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

**మణుగూరు, విశాలభారతి:**

మణుగూరు డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న ఇల్లటూరి మహేష్ మంగళవారం మణుగూరు నుండి అమలాపురం డ్యూటీకి వెళ్లి తిరిగి మణుగూరు డిపో కి బయలుదేరి వస్తున్న క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న అశ్వరావుపేటకు చెందిన ప్యాసింజర్ లక్ష రూపాయలు నగదు ఉన్నటువంటి పర్సు బస్సులో పడిపోవడంతో ఈ విషయాన్ని బాధితుడు ఆర్టీసీ అధికారులకు తెలియజేయడంతో మహేష్ బస్సులో తనిఖీ చేయగా దొరికిన పర్సును గమనించిన డ్రైవర్ మహేష్ దానిలో లక్ష రూపాయలు నగదు ఉండడంతో వాటిని మణుగూరు డిపో సెక్యూరిటీ అధికారులకు అప్పగించాడు. బుధవారం ఉదయం ఆర్టీసీ అధికారులు బాధితుడికి లక్ష రూపాయలు అందజేశారు. పోగొట్టుకున్న లక్ష రూపాయలను తిరిగి ప్యాసింజర్ కు అందజేసిన డ్రైవర్ మహేష్ ని, ప్యాసింజర్, ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.




## విజయలక్ష్మీ ఆసుపత్రి పై మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు

- **కవలల మృతికి కారణమైన ఆసుపత్రిపై**
- **చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన బుట్టి గణేష్**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

పిల్లల కోసం ఆరేళ్ల నిరీక్షణ.. ఎన్నెన్నో ఆశలు.. చివరికి ఆమె గర్భవతైంది. కానీ, ఐదు మాసాలకే ఆశలు అడియాసలయ్యాయి. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా నెలలు నిండని ఓ గర్భిణికి నర్సులు చేసిన వైద్యం వికటించి కవల పిల్లలు మృతి చెందిన సంఘటన అందరికీ తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు కు చెందిన బుట్టి గణేష్ భార్య కీర్తి గర్భిణీ స్త్రీకి గత 3 వారాల క్రితం విజయ లక్ష్మీ ఆసుపత్రిలో వైద్యురాలి సలహా మేరకు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా నర్సులు వైద్యం అందించి కవల శిశువుల మృతికి కారణమైన ఆసుపత్రిని జిల్లా వైద్య అధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపద్యంలో మళ్ళీ ఆసుపత్రి ప్రారంభించడంతో కీర్తి భర్త బుధవారం మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తన భార్యకు నిర్లక్ష్యంగా అర్హత లేని నర్సులతో వాట్సాప్ వైద్యం అందించి కవలల మృతికి కారణమైన ఆ ఆసుపత్రి డాక్టర్ అనుషా రెడ్డి లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కల్వకుంట్ల కవిత లేఖ అస్త్రంపై రాద్ధాంతం తగదు

- **కూరెల్లి నాగరాజ్ గౌడ్.**

**విశాలభారతి,ఓయూ:**




ఎమ్మెల్సీ కవిత తన లేఖ ద్వారా పార్టీలో జరుగుతున్న వాస్తవాలను తెలియజేసిందని టిఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఊరెళ్ళి నాగరాజ్ గౌడ్ అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ. టిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సభ విజయవంతం కావడంతో పాటు పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అభిప్రాయాలను పార్టీ అధినేత కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లడానికి ఏదైతే లేక రాసిందో అందులోని పూర్తిగా వాస్తవ విషయాలన్నారు. పార్టీ క్యాడర్, నాయకుల మధ్య ఉన్న గ్యాపు ఏ విధంగా భర్తీ చేయాలి, పార్టీ పటిష్టత కు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుంది అనే విషయాలపై పలు సూచనలతో కూడిన లేఖను రాసిందని పేర్కొన్నారు. ఈ లేకపై ఇటీవల కాలంలో అనేక ప్రసారం మాధ్యమాల్లో ఉన్నది లేనట్టు లేని ఉన్నట్టుగా కవిత పార్టీ వీడుతున్నట్లుగా పార్టీ లో చీలిక ఏర్పడుతున్నట్లుగా అసత్య ఆరోపణలు ప్రచురిస్తూ ప్రచారం చేయడాన్ని నాగరాజ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయాలని ఏకైక ఉద్దేశంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేక ద్వారా అధిష్టానానికి తెలియజేసిన ప్రయత్నం మాత్రమే అన్నారు.భవిష్యత్తులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎలాంటి నిర్ణయం తీసుకున్న తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం,
29.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ఫలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కృషి..

- పటాన్ చెరు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం రూ. 200 కోట్ల నిధుల మంజూరు
- త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పోరేట్ విద్యను అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను పటాన్ చెరులో ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు. పాఠశాల ఏర్పాటు కోసం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 993 లో 25 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించడం జరిగిందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందని తెలిపారు. ఆధునిక వసతులు అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటయ్యే రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీకి అండగా నిలిచిన వారికి పదవులు ఇవ్వాలి

*** మడుగుల సంపత్ కుమార్**



**విశాలభారతి,భీమదేవరపల్లి :**

కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి, ప్రభుత్వ ఒత్తిళ్లను తట్టుకుని పార్టీకి అంకితంగా పనిచేసిన కార్యకర్తలకు ఇప్పటి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పదవులు, టికెట్లు కేటాయించి గౌరవించాలని మండల కాంగ్రెస్ కార్యదర్శి మడుగుల సంపత్ కుమార్ అన్నారు. సభ్యత్వ నమోదు, ప్రభుత్వ వైఫల్యాల పై ఉద్యమాలలో పాల్గొన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 2017 నుండి నిస్వార్థంగా పనిచేస్తున్న వారిని గుర్తించాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల

- రూ.16 కోట్ల సిఎస్ఆర్ నిధులతో నూతన భవనం, మౌలిక వసతులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి**

తెలంగాణ రాష్ట్రంలోనే రుద్రారం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను 16 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

బుధవారం పటాన్ చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఎంవైకే లాటిక్రేట్ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణ ప్లాన్, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుద్రారం గ్రామ పరిధి నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాల భవనాలను ఆధునిక సాంకేతికతతో నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఎంవైకే లాటిక్రేట్ పరిశ్రమ సహకారంతో 16 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ కృతిక ద్వారా ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మూడు ఎకరాల 34 గుంటల స్థలంలో 43,378 చదరపు అడుగుల విస్తీర్ణంతో 15 తరగతి గదులు, మండల పరిషత్ పాఠశాలను ఒక ఎకరా 23 గుంటల స్థలంలో 26,586 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 తరగతి గదులు నిర్మించబోతున్నట్లు తెలిపారు. వీటితోపాటు పుట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండు, మాజీ ఎంపీటీసీలు రాజు, హరి ప్రసాద్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, ఎంవైకే లాటిక్రేట్ సంస్థ ప్రతినిధి రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

**రూ.60 లక్షలతో అదనపు తరగతి గదులు..**

**- ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 60 లక్షల రూపాయల నిధులతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ముత్తంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో గల గదులు శిథిలావస్థకు చేరుకోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు గతంలో తమ దృష్టికి తీసుకొని వచ్చారని ఆయన తెలిపారు. అమెరికాకు చెందిన మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు 60 లక్షల రూపాయలతో తరగతి గదులు నిర్మించేందుకు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. రాబోయే కొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభించి.. తరగతి గదులను అందుబాటులోకి తీసుకొని వస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నరసింహారావు, మేరాజ్ ఖాన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలయ భూముల వేలం పాట ప్రకటన

**విశాలభారతి,భీమదేవరపల్లి:**




ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న పట్టా భూముల సాగు హక్కుల కోసం ఈ నెల 29వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట జరగనుందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పీ. కిషన్ రావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం, ఈ వేలములు మొత్తం 14 04 ఎకరాలుగా ఉండగా, జూన్ 19, 2025 నుండి జూన్ 18, 2026 వరకు సాగు హక్కులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/1987 నిబంధనల ప్రకారం నిర్వహించబడనుంది. వేలంపాటలో పాల్గొనదలచిన వ్యక్తులు తమ ఆధార్ కార్డుతో పాటు, ఖాళీ చెక్ తీసుకుని రావలెను. అలాగే, డిపాజిట్ చెల్లించిన తర్వాత మాత్రమే వేలంపాటలో పాల్గొనే అర్హత కలుగుతుందని, వేలము పాట కాలంలో వచ్చే పకృతి వైపరీత్యాలు, కష్టనష్టాల బాధ్యత పూర్తిగా పాటదారులదే అని అధికారులు స్పష్టం చేశారు. ఈ వేలంపాటను ముందుగా ఎవరికి తెలియజేయకుండా రద్దు చేయడం గానీ, వాయిదా వేయడం గానీ కార్యనిర్వాహణాధికారికి ఉంటుందని తెలిపారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు – కొప్పూరులో అవగాహన కార్యక్రమం

**విశాలభారతి,భీమదేవరపల్లి:**

మండలంలోని కొప్పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా వరంగల్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. వెంకట్ రెడ్డి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యూరియా వినియోగం, రసాయన ఎరువుల మోతాదులు, నీటి సద్వినియోగం, పంటల మార్పిడి, అధునాతన విత్తన రకాలు, మరియు వరి, పత్తి పంటల సస్యరక్షణ పద్ధతులపై సమగ్రంగా వివరించారు. రైతులు అడిగిన సందేహాలకు ప్రత్యక్షంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జీవశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. మానస రెడ్డి మాట్లాడుతూ, సుస్థిర వ్యవసాయానికి జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాడే విధానాలు, అజోల్ల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జీవన ఎరువులు మట్టి ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఎంతగానో సహాయపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసోలైట్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు మను శ్రీ ప్రసాద్, మౌనికతో పాటు గ్రామస్థులైన పలువురు రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

- చేపూరి వెంకటేశ్వరరావు

**సికింద్రాబాద్,విశాలభారతి:**

ఆపదలో ఉన్న వారిని ఆదుకొని వారికి తగిన సహాయం అందించాలని సికింద్రాబాద్ నియోజక వర్గం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చేపూరి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. చేపూరి ఆధ్వర్యంలో మున్నూరు కాపు బిడ్డ బి. సంతోష్ కుమార్ మరణించారు. విషయం తెలుసుకున్న చేపూరి వెంకటేశ్వరరావు పట్నం సంగీత మురళి కృష్ణ కుటుంబానికి నిత్యావసర వస్తువుల తో పాటు కొంత ఆర్థిక సహాయం చేసారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిల్లి శ్రీనివాసరావు తో చర్చించి సంఘం తరపున సహాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో చోక నారాయణ, బల్గురి శంకర్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పట్నం సంగీత మురళి కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు.



# ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసిన ఎమ్మెల్యే

**కొడకండ్ల, విశాలభారతి:**

జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ స్టాండ్ చౌరస్తాలో ధారవత్ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జి ఝాన్సీ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గానికి 200ల కోట్లరూపాయల అత్యధిక నిధులతో అన్ని సదుపాయాలతో కూడిన స్కూలును మన ప్రభుత్వం మంజూరు చేయడం గర్వకారణం అన్నారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి బంగారు భవిష్యత్తు ప్రణాళికను రూపొందించడంతోపాటు విద్యాభివృద్ధికి తోడ్పాటుకు భవిష్యత్తులో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుకొడకండ్ల టౌన్ కార్యకర్తలు వివిధ గ్రామల పార్టీ అధ్యక్షులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




# బంగారం షాపులో చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

**మణుగూరు, విశాలభారతి:**

ఈ నెల 23 శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో మణుగూరు మెయిన్ రోడ్ నందు గల శ్రీవారి జువెలర్స్ షాపులో ఒక్కరు మాత్రమే ఉండడం గమనించి ఒక వ్యక్తి మాస్క్ వేసుకొని షాపు లోపలికి వెళ్లి షాప్ లో పనిచేస్తున్న ఆమెతో మాటల్లో పెట్టి షాపులో నుండి బంగారు ఆభరణాలు సుమారు 132 గ్రాము ల బాక్స్ ను దొంగిలించడం జరిగింది. షాపు యజమాని అయిన దేవతా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మణుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ. బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్. ఐ ప్రసాద్, సి.సి.ఎస్, ఎస్.ఐ రామారావులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం సీసీటీవీ ఫుటేజీ, లాడ్జిలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళ వారం ఎస్. ఐ ప్రసాద్ తన సిబ్బంది రామారావు, కొర్ర బాలు లతో హనుమాన్ టెంపుల్ దగ్గర్లో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి పోలీసు వారిని చూసి భయపడి పారిపోవుటకు ప్రయత్నించగా అతనిని వెంబడించి, పట్టుకొని విచారించగా తన పేరు గొర్రెల సత్యనారాయణ ,ఆకివీడు, భీమవరం జిల్లా ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన వాడని చెప్పి తాను మణుగూరు శ్రీవారి జువెలరీ షాప్ లో చేసిన దొంగతనం ఒప్పుకొని అందులో నుండి తీసిన బంగారం చైన్లు 6 నల్లపూసల గొలుసు 1 బేబీ రింగ్స్ 5 సుమారు 132 గ్రాముల బరువుగలవి తీసి చూపించినాడు, అంతేగాక తాను అంతకు ముందు వరంగల్ సాయి గణేష్ జువెలరీ షాపులో దొంగతనం చేసిన చిన్న చిన్న బంగారం చెవి కమ్మలు 20 జతలు సుమారు 30 గ్రాములు కూడా చూపించాడు. గొర్రెల సత్యనారాయణ సుమారు 35 పైగా రెండు రాష్ట్రాలలో బంగారు షాపులలో దొంగతనం కేసులు నమోదు అవ్వడం జరిగింది. మణుగూరు, వరంగల్ తో పాటు తిరుపతి, కర్నూల్లో కూడా దొంగతనాలు చేసినట్టు నేరాలు ఒప్పుకోవడం బుధవారం నిందితున్ని మణుగూరు కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందని డీఎస్పీ రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

# ఏసీబీ వలలో ఆర్ఐ కృష్ణ

- తహసిల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి
- 7 గుంటల భూమి బదలాయింపుకు రూ. 12 లక్షలు డిమాండ్
- ఆర్ఐ కృష్ణను చాకచక్యంగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న జి. కృష్ణను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సుమారు మూడు గంటల పాటు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఆర్ఐ కృష్ణ లంచం డిమాండ్ చేసినట్లు నిరూపితమవడంతో ఆయన్ను అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆర్ఐ కృష్ణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించిన వివరాల వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిభట్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 355 కు సంబంధించిన ఏడు గుంటల భూమి తన తండ్రి నుండి అభ్యర్థిదారునికి బదలాయించడానికి ఇబ్రహీంపట్నం ఆర్ ఐ కృష్ణ రూ. 12 లక్షలు డిమాండ్ చేశాడు. రూ. 9 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, తన పైఅధికారులకు సైతం లంచం ఇవ్వాల్సి ఉంటుందని అప్పుడే 7 గుంటల భూమి జోడించడం వీలవుతుందని ఆర్ఐ కృష్ణ సదరు వ్యక్తికి తెలిపాడు. మొదటగా రూ. 5 లక్షలు ఇవ్వాలని, పని అయిన తర్వాత మిగతా మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఆర్ఐ కృష్ణ ఉద్దేశపూర్వకంగానే భూమిని జోడించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు తేలడంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



# చికిత్స పొందుతున్న మున్సిపల్ ఉద్యోగి ని పరామర్శ

**ఆర్మూర్, విశాల భారతి.**

అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్మూర్ మున్సిపల్ ఉద్యోగి నరేష్ ను బుధవారం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. బాధితుడి కుటుంబ సభ్యులు పెండింగ్ లో ఉన్న ఈఎస్ఐ బకాయిలు చెల్లిస్తే మెరుగైన చికిత్స అందుతుందని వినయ్ రెడ్డికు తెలిపారు. తక్షణమే స్పందించి పెండింగ్ లోఉన్న 36 లక్షల రూపాయలను ఈఎస్ఐ వారికి చెల్లింపు చేయడం జరిగిందని తెలిపారు. బాధితుడు యశోద ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ ఈఎస్ఐ ద్వారా ఆసుపత్రి బిల్లులు చెల్లింపులు జరుగుతాయని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



cinema updates



# బ్యాక్ టు బ్యాక్ హిట్‌తో మీనూ మేడం బిజీ బిజీ

టాలీవుడ్‌లో ప్రస్తుతం మీనాక్షి చౌదరి టైం నడుస్తోంది. రాబోయే రోజుల్లో యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈ అమ్మడు నటించబోతుంది. గత ఏడాదిలో లక్కీ భాస్కర్ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి ఈ ఏడాది ఆరంభంలో వెంకటేష్‌తో కలిసి అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా, వెంకటేష్ మాజీ ప్రియురాలు అయిన మీనూ పాత్రలో ఈమె నటించి మెప్పించింది. ముఖ్యంగా మీనాక్షి చౌదరి అందంతో పాటు, అభినయం తో మెప్పించింది.గత ఏడాది ఆరంభంలో గుంటూరు కారం సినిమాలో నటించింది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా కనిపించడంతో పాటు, ఆ సినిమా హిట్ కాకపోవడంతో మీనాక్షి చౌదరికి నిరాశే మిగిలింది. ఆ తర్వాత తమిళ్ సూపర్ స్టార్ విజయ్‌తో కలిసి ది గోట్ సినిమాలోనూ నటించింది. ఆ సినిమాతో తమిళనాట కూడా ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. అయితే లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు సూపర్ హిట్ కావడంతో టాలీవుడ్‌లోనే ఈమెకు ఎక్కువగా ఆఫర్లు వచ్చాయి. ప్రస్తుతం ఈమె రెండు క్రేజీ సినిమాల్లో ఈమె నటిస్తుంది. ఆ రెండు సినిమాల్లో ఒకటి ఈ ఏడాది విడుదల కానుండగా, మరోటి వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నవీన్ పొలిశెట్టి హీరోగా రూపొందుతున్న అనగనగా ఒక రాజు సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యి చాలా రోజులు అయింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తున్న నేపథ్యంలో అంచనాలు మరింత పెరిగాయి. ఆ మధ్య నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి ల వీడియో ఒకటి బయటకు వచ్చింది. వీరిద్దరికి సరి జోడీ అంటూ అంతా ప్రశంసించారు. నవీన్ పొలిశెట్టితో మాత్రమే కాకుండా నాగ చైతన్యతోనూ మీనాక్షి చౌదరి ఒక సినిమాను కమిట్ అయింది. కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా రూపొందబోతున్న సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించబోతుంది.తండేల్ వంటి బ్లాక్ బస్టర్ విజయం తర్వాత నాగ చైతన్య సినిమా అనగానే అంచనాలు భారీగా ఉన్నాయి. దానికి తోడు కార్తీక్ దండు దర్శకత్వంలో సినిమా కావడంతో అంచనాలు మరింతగా ఉన్నాయి. తండేల్ రేంజ్‌లో మరో వంద కోట్ల సినిమాను నాగ చైతన్య చేయబోతున్నాడనే విశ్వాసంను అక్కినేని ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. అలాంటి క్రేజీ మూవీలో నాగ చైతన్య నటిస్తున్న నేపథ్యంలో మీనాక్షి చౌదరి క్రేజ్ మరింతగా పెరగడం ఖాయం. వచ్చే ఏడాదిలో ఈ అమ్మడు మరిన్ని క్రేజీ మూవీల్లో, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. వరుసగా విజయాలను సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.



# క్రేజీ ప్రాజెక్ట్ దక్కించుకున్న డ్రాగన్ బ్యూటీ

ఈ ఏడాది ఆరంభంలో 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కయాదు లోహర్. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్రాగన్ సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో కయాదు లోహర్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. అంతకు ముందు తెలుగులో అల్లూరి అనే సినిమాలో నటించిన ఈ అమ్మడికి అంతగా గుర్తింపు దక్కలేదు. కానీ డ్రాగన్ సినిమాతో తెలుగులోనూ ఈమెకు మంచి పాపులారిటీ దక్కడం మాత్రమే కాకుండా టాలీవుడ్ నుంచి పిలుపు అందింది అనే వార్తలు వస్తున్నాయి. ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అతి త్వరలోనే ఆ తెలుగు సినిమాలు ఏంటి అనే విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ప్రస్తుతం తమిళ్‌లో రెండు మూడు సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు తాజాగా మలయాళ సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న ఐయామ్ గేమ్ అనే సినిమాలో కయాదుకు ఛాన్స్ దక్కిందనే వార్తలు జోరుగా వస్తున్నాయి. మలయాళ సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా దుల్కర్ సల్మాన్‌కి అన్ని భాషల్లోనూ అభిమానులు ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈయన చేసిన ప్రతి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే దుల్కర్ సల్మాన్ మలయాళంలో సినిమా చేస్తూ ఉన్నా కూడా తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. అలాంటి క్రేజీ స్టార్ సినిమాలో కయాదు నటించడం వల్ల కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ప్రస్తుతం కయాదు చేస్తున్న సినిమాల్లో అన్నింటి కంటే దుల్కర్‌తో చేయబోతున్న సినిమా ఆమెకు స్టార్‌డం తెచ్చి పెడుతుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. డ్రాగన్ సినిమాతో వచ్చిన పాపులారిటీని సద్వినియోగం చేసుకుంటూ ఉన్న కయాదు లోహర్ తక్కువ సమయంలోనే పాపులర్ స్టార్స్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది. ముందు ముందు కూడా కయాదు లోహర్ సూపర్ హిట్ సినిమాల్లో నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఐయామ్ గేమ్ సినిమాలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించడం మాత్రమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నాడు. దాంతో సినిమాపై ఆయనకు ఉన్న నమ్మకం ఏంటో అర్థం చేసుకోవచ్చు. 2021లో ముగిల్పేట అనే కన్నడ సినిమాలో నటించడం ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయిన కయాదు లోహర్ మొదటి సినిమాతో ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. 2022లో ఈ అమ్మడు మలయాళంలో ఒక సినిమా, తెలుగులో ఒక సినిమా చేసింది. సౌత్‌లోనే కాకుండా ఈ అమ్మడు మరాఠి సినిమాలో కూడా నటించింది. ప్రస్తుతం తమిళ్, మళయాల సినిమాల్లో నటిస్తున్న ఈ అమ్మడు వచ్చే ఏడాదిలో తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. త్వరలో ఈమె తమిళ్‌లో నటిస్తున్న ఇదయం మురళి సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమా తర్వాత కయాదు మరింత బిజీ అవుతుందనే విశ్వాసంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.